# అంటుమొక్క



అనుపమ ఎంతకీ రాకపోయేసరికి చూస్తున్న టీవీ విసుగ్గా అనిపించడంతో దానిని ఆఫ్ చేసి టీపాయ్ మీద ఉన్న ఆల్బమ్ తీసి మొదటినుంచీ చూడసాగింది కౌసల్య. మొదటిపేజీ నుంచి ఎన్నెన్నో తీపిగుర్తులు. ఆడదాని జీవితంలో ఎన్నెన్నో అధ్యాయాలు! ప్రతీ అధ్యాయంలోనూ ఒక పాత్ర పోషించాలి. ఇన్ని రూపాంతరాలు పొందేది ఈ ప్రపంచంలో కేవలం ఆడదేనేమో.

ఆలోచిస్తూనే పేజీలు తిప్పుతున్న కౌసల్య ఎదురుగా అనుపమ చిన్ననాటి ఫోటోలు పలకరించడంతో ఈ లోకంలోకి వచ్చింది. వెల్ బేబీ షోలో ఫస్ట్‌ప్రైజ్ పొందిన ఫోటో అది. బొద్దుగా బొండుమల్లి రేకుల్లాంటి నేవళంతో బుగ్గలు మెరిసిపోతున్న ఆ ఫోటో అంటే ఆమెకు చాలా ఇష్టం. ఆమె ఆ ఫోటోపేజీని సుతారంగా ముద్దాడింది.

అంతలోనే గేటుబయట బైక్ శబ్దం వినబడటంతో ఆల్బమ్ మూసి టీపాయ్ మీద పెట్టి గుమ్మంలోకి వచ్చి నిలబడింది కౌసల్య.

నందకిషోర్‌తో మాట్లాడి అతన్ని పంపేసి గేటు తీసుకుని లోపలకు వచ్చింది అనుపమ.

"ఏమ్మా! ఇంత లేటయింది?" అడిగింది కౌసల్య కూతుర్ని.

"ఏంలేదు మమ్మీ! ట్రైను లేటయింది. తలనొప్పిగా వుంది కాస్త హార్లిక్స్ ఇవ్వవూ"

"అలాగే! నువ్వు స్నానం చేసిరా. రెండు నిమిషాల్లో రెడీ చేస్తాను"

"అబ్బా! స్నానం చేసే ఓపిక లేదు. అసలే ఆ డి.టి.పి. వర్కుచేసి బుర్ర వేడెక్కిపోయింది. వెంటనే ఇవ్వు మమ్మీ!" జాలిగా అడిగింది అనుపమ.

"చూడు, నా అంత ఎదిగిన పిల్లవు నువ్వు! శుచి శుభ్రతల గురించి చెప్పించుకునే వయసు కాదు నీది. ఈ మధ్య నీలో బాగా మార్పు వస్తోంది. బెడ్‌కాఫీ తాగడం రెండు వారాలకు గానీ తలంటుకోకపోవడం, ఇంటికి వచ్చాక డ్రస్ మార్చకుండా ఆ డ్రస్‌తోటే వుండిపోవడం - నాకు తెలిసిన కూతురేనా ఇలా ప్రవర్తిస్తోంది అనిపిస్తోంది. ఎన్ని హెవీవర్కులు వున్నా కాన్వెంట్లో చదువుతున్నపుడు 'నీ గుడ్‌మానర్స్ చూసి నేను నేర్చుకోవాలి అనేలా ప్రవర్తించిన నువ్వేనా ఇలా... వెళ్ళు! వెళ్ళి స్నానం చేసిరా. నాచేత ఎక్కువ వాగించకు!"

తల్లి అలా మాట్లాడేసరికి రెండుచేతులూ జోడించి నమస్కరించి బాత్‌రూమ్‌లో దూరింది అనుపమ. చల్లటి నీళ్ళు అలసిన శరీరం మీద బొట్లు బొట్లుగా

పడుతుంటే శరీరంలోని వేడంతా దిగిపోయి మబ్బుల్లోని చల్లదనం మనసు లోకి పాకినంత హాయిగా ఫీలయింది అనుపమ.

"ఎంతసేపు! అతివృష్టి అనావృష్టీను. హార్లిక్స్ చల్లారిపోతోంది." కౌసల్య మాటలు చెవుల్లో పడేసరికి బాత్‌రూమ్‌లోంచి బయటకు వచ్చి తల్లిచేతుల్లో కప్పు అందుకుంది అనుపమ.

"గదిలోకి వెళ్ళి బట్టలు మార్చుకో నీతో మాట్లాడాలి." అంది కౌసల్య.

తల్లి కేసి వింతగా చూస్తూ తన గదిలోకి నడిచింది అనుపమ.

అనుపమ నైటీ వేసుకు వచ్చేసరికి కౌసల్య బోన్సాయ్ మొక్కలకు వాటరింగ్ చేసి కొమ్మలు కత్తిరిస్తోంది.

కౌసల్యకు మొక్కలంటే పంచప్రాణాలు. పట్నవాసంలో, అందునా అపార్ట్‌మెంట్ కల్చర్ డెవలప్ అయ్యాక నచ్చిన మొక్కను నేలలో నాటుకుని చక్కగా పెంచుకుని దాని ఫలాలను ఆస్వాదించే అదృష్టం ఎలాగూ లేదు. అందుకే తాను బోన్సాయ్ పెంపకాన్ని ఎంచుకుంది. గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఎన్నో అంటుమొక్కలను పెంచుతుంది. ఆమొక్కలను కూతురు తాకినా తిడుతుంది. ఒక విధంగా తనకంటే అవంటేనే అమ్మకు ఎక్కువ ఇష్టమేమో అన్నంత ప్రేమగా తల్లి వాటిని పెంచడం చూసి అసూయతో ఆ మొక్కల్ని కసితీరా పీకేసేయాలనిపిస్తుంది అనుపమకు.

ఆ పని పూర్తిచేశాక కౌసల్య వచ్చి సోఫాలో కూర్చుంది.

అనుపమ వచ్చి తల్లి ఒడిలో తలపెట్టి పడుకుంది.

"ఇప్పుడు చెప్పమ్మా! ఏదో మాట్లాడాలన్నావ్?"

"అవును. ముక్కుసూటిగా ఒకటి అడుగుతాను. చెబుతావా?" అంది కౌసల్య.

"అడుగు!"

"నందకిషోర్ మీద నీ అభిప్రాయం?"

తల్లి నుంచి ఊహించని ప్రశ్న ఎదురయ్యేసరికి సంభ్రమాశ్చర్యాలతో నిటారుగా లేచి కూర్చుంది అనుపమ.

"ఏమిటమ్మా ! దేని గురించి నువ్వు అడిగావ్?" తాను తప్పుగా విందేమో అన్న భ్రమతో - అడిగింది అనుపమ.

"అదే! నందకిషోర్ మీద నీ అభిప్రాయం ఏమిటని అడుగుతున్నాను" స్థిరంగా అంది కౌసల్య.

"అమ్మా! నువ్వు ఎంత మంచిదానివి! సరిగ్గా నా మనసు విప్పి నీతో మాట్లాడుదామనుకున్న విషయంకూడా ఇదేనమ్మా"

"అంటే నువు నందకిషోర్ ను ఇష్టపడుతున్నావా?"

"అతని గురించి నీతో చెప్పి నీ అనుమతితో పెళ్ళిచేసుకుందామని అనుకున్నానమ్మా".

"అలాగా! మరి అతనికి నీమీద అభిప్రాయం ఏమిటో తెలుసుకున్నావా?"

"ఓ! అతనికి నేనంటే పిచ్చి ప్రేమ. రోజూ ఉదయం నేను రాజమండ్రి ట్రైన్ ఎక్కేవరకు స్టేషనులో పడిగాపులు కాస్తాడు. మళ్ళీ ఈవినింగ్ రిసీవ్ చేసుకోవడానికి

వస్తాడు. నన్ను పైసా తీయనివ్వడు. ఆడపిల్ల చేత డబ్బు ఖర్చు పెట్టించేటంత మూర్ఖుడిని అనుకున్నావా ? అంటాడు. అనుక్షణం నన్ను నవ్విస్తూ ఉంటాడు. నేను విచారంగా ఉండటం తనకిష్టముండదు. యిప్పుడు చెప్పు. అతనంటే నీ అభిప్రాయం.?'' ఎదురుప్రశ్న వేసింది అనుపమ.

"నీ ప్రశ్నకు రేపు సమాధానం చెబుతాను. అన్నట్టు రేపు సెకండ్ సాటర్ డే. నీకు కూడా హాలిడే కదా ! రేపు నర్సరీకి వెళ్ళొద్దాం. రెండు మొక్కలు గ్రాఫ్టింగ్ చేయించుకు వద్దాం సరేనా."

"అలాగే. కానీ యిప్పుడే చెప్పమ్మా ప్లీజ్!"

"లేదు పిచ్చిమొద్దు. నన్ను బాగా ఆలోచించుకోనీ. నేను ఏం చేసినా నీ మేలు కోరే కదా చేసేది" అంది కౌసల్య చమర్చిన తన కనుల తడి అనుపమ కళ్ళబడకుండా దాచే ప్రయత్నం చేస్తూ.

"అమ్మా! ఈ మధ్యనువ్వన్నట్టు నాలో చాలా మార్పు వచ్చినట్టుంది. ఎందుకో ఎవరో నన్ను నీ నుంచి దూరంగా లాక్కుపోతున్నట్టుగా అనిపిస్తోంది. మళ్ళీ అ లాక్కువెళ్తున్న హస్తం స్నేహపూర్వకంగానే ఉంది. అయినా సరే! నిన్ను విడిచి నేను బ్రతకలేనమ్మా! నేను బ్రతకలేను'' అంతలోనే ఏడవసాగింది అనుపమ తల్లి ఒడిలో ముఖం దాచుకుని.

"ఛ! తప్పుకదూ! ఆడపిల్ల ఎప్పుడూ ధైర్యంగా ఉండాలి. అలా ఏడవచ్చా! నీకు నేను లేనూ! లే! భోం చేద్దాం". అంటూ కూతురి కళ్ళు తుడిచి డైనింగ్ టేబుల్ దగ్గరకు నడిచింది కౌసల్య.

మరునాడు ఉదయమే వేరే పనేమీ లేనట్టుగా వచ్చిన నందకిషోర్‌ను చూస్తూనే ఒళ్ళు మండిపోయింది. అయినా ఆప్యాయంగానే మాట్లాడింది కౌసల్య. గత రెండు సంవత్సరాలుగా అతను అనుపమ ఫ్రెండ్‌గా యింటికి వచ్చిపోతున్నాడు. వాళ్ళిద్దరూ ఎక్కడెక్కడ తిరిగి వచ్చి లేటైనా 'ఆంటీ ఈ పూట నా భోజనం మీ ఇంట్లోనే.' అని నిర్మొహమాటంగా చెప్పేస్తాడు. అతని తత్వం తెలిసిన తను ఏరోజూ కూడా అలాగే వంట చేసి ఉంచేది.

" మీరొక్కసారి నాన్‌వెజ్ చేస్తే తినాలని ఉందాంటీ. మీ వంట అమృతంలా ఉంటుంది. అనూ అదృష్టవంతురాలు'' అన్నాడు ఓరోజు భోజనసమయంలో.

"నువ్వలా చెప్పు నాయనా! అసలే లావెక్కుతున్నానని డైటింగ్ పేరుతో అమ్మ నన్ను కంట్రోలు చేస్తోంది. దానికి మళ్ళీ నీ సపోర్టా" అంది అనుపమ చిరుకోపంగా.

"అయితే మాత్రం నీ బరువులో ఏమాత్రం తేడా రాకుండా నీకు కావలసిన వన్నీ కొనిపెడుతూనే వున్నాగా?'' అనేసి నాలిక్కరుచుకున్నాడు నందకిశోర్.

తనకేం పట్టనట్టుగా వుంది కౌసల్య.

"నీకు నా చేతులతో చేసిపెట్టలేనిది నువ్వడిగిన నాన్‌వెజ్ ఒక్కటేనయ్యా. ఎందుకంటే మనిషికి జన్మతః కొన్ని లక్షణాలు, ఆహారపు అలవాట్లు వస్తాయి.

చిన్నతనం నుంచీ వెజిటేరియన్ వాతావరణమే తప్పమరో వాతావరణం తెలియని నేను ఈవేళ ఆ అలవాటు చేసుకోలేను . ఆ వాసన అంటేనే పడదు నాకు. మళ్లీ జన్మలో చూద్దాంలే" అంటూ తేలికగా నవ్వేసింది కౌసల్య.

"పోనీ కనీసం అనుపమకైనా అలవాటు చెయ్యండి. నాఫ్రెండ్‌షిప్‌లో ఆపాటి మంచి లక్షణం నేర్చుకోకపోతే ఎలా? ఫ్యూచర్‌లో తనూ అలవాటు పడాలిగా" అన్నాడు నందకిశోర్.

"నాకేం ఆ అవసరం లేదు బాబు" అంది అనుపమ సాగదీస్తున్నట్టుగా.

"రేపు పెళ్ళయ్యాక అవసరమైతే?".

"అయినా సరే నేను చెయ్యనయ్యా బాబూ! వాడికి కావలిస్తే ఏ మిలట్రీ హోటల్‌కో పోయి తినమంటాను".

"అది నేనే అయితే" అన్నాడు అర్థోక్తిగా.

"నువ్వా? అయితే అప్పుడు చూద్దాంలే"

కౌసల్య మధ్యలో అందుకుంది "పోనీ! నువ్వే నీ అలవాట్లు మానుకుని వెజిటేరియన్‌గా మారిపోవచ్చుగా"?

"భలేవారు ఆంటీ! నాన్‌వెజ్ మీరు తినలేదుగానీ తింటేఅసలు వదిలిపెడతారేంటీ? సరిగ్గా వండాలి గానీ వండితే మొత్తం కూర మీరొక్కరే లాగించేస్తారు తెలుసా? అయినా అది మానడం అసాధ్యం. ఎందుకంటే మా నాన్‌వెజ్ వాళ్ళకున్న బలహీనత దాన్ని మానలేకపోవడమే. దయచేసి నన్ను మానమని మాత్రం మీరేనాడు సలహా ఇవ్వకండి. ఇక ఆ టాపిక్ వదిలేద్దాం" అన్నాడు దృఢంగా.

"ఎగ్జాక్ట్‌లీ రైట్! సరిగ్గా నా రూట్‌లోకే వచ్చావు" అంది తనుకూడా.

యధాప్రకారం ముగ్గురి భోజనాలు పూర్తయ్యాయి.

"అనూ! ఏదయినా సినిమాకు వెళ్దాం" అన్నాడు లేవబోతూ.

"అరె! మేం వేరే ప్రోగ్రాం ఫిక్స్ చేసుకున్నాం నందూ. నర్సరీకి వెళ్ళి రావాలి. పైగా డి.టి.పి. వర్క్ ప్రూఫ్ కరక్షన్ ఏదో చేసుకోవాలన్నావు కదమ్మా?" అంది అనుపమనుద్దేశించి కౌసల్య.

"నేనెప్పుడన్నానూ?" అనబోయి తల్లి కంటిసైగ చూసి ఆగిపోయి అంది అనుపమ.

"యస్ నందూ! ఈవేళ, రేపు నన్ను ఎక్కడకీ రమ్మనకు. నిజంగా వర్కు హెవీగా ఉంది ప్లీజ్" అంది కళ్ళతో బ్రతిమలాడుతున్నట్టుగా.

ఏమనుకున్నాడో ఏమో నందకిశోర్ వెళ్ళిపోయాడు మరేం మాట్లాడకుండా.

అతనికి కౌసల్యతో వాదించడం అంటే ఎంతో యిష్టం. ఎంతసేపు తన పాయింట్ ఆఫ్ వ్యూలో మాత్రమే ఆలోచించడం మానమంటుంది కౌసల్య. ఎదుటివారి స్థానంలో నిలబడి ఆలోచిస్తే ఫలితం వేరుగా ఉంటుంది - అంటుంది. 'నాకు వచ్చిన పరిస్థితిని బట్టి నేను ఆలోచిస్తాను గానీ

ఎదుటివాడిలా నేనెందుకు ఆలోచిస్తాను' అంటాడతను. వీరిద్దరి వాదనా తమాషాగా ఉంటుంది అనుపమకు.

"ఈవేళ ఎందుకో వాదనకు దిగలేదు గురువుగారు!" అంది అనుపమ.

"నీమొహం! పద పద. వెళ్ళొద్దాం" అంటూ తయారవ్వడానికి ఉద్యుక్తురాలైంది కౌసల్య.

★★★

స్కూటీ దిగి పచ్చని మొక్కలతో కళకళలాడుతూ వికసించిన, విరబూసిన రకరకాల పుష్పాలతో కనువిందుచేస్తూ సువాసనలు వెదజల్లుతున్న నర్సరీ వాతావరణంలో అడుగుపెడుతూనే హాయిగా సుదీర్ఘ శ్వాసలు తీసింది అనుపమ. సన్నీ పార్క్‌చేసి, లాక్‌చేసి వచ్చిన కౌసల్య అనుపమతో అంది.

"ఈ వాతావరణం ఎంతో బాగుంది కదూ!"

"అవును మమ్మీ. యిలాంటి ఒక పెద్దనర్సరీ పెంచుకుని మధ్యలో ఒక అందమైన డాబా కట్టుకుందాం మమ్మీ"

పకపకా నవ్వింది కౌసల్య. తల్లి అంతలా నవ్వడం ఈ మధ్య చూడని అనుపమ అడిగింది - " అదేంటిమమ్మీ! ఎందుకు నవ్వుతున్నావ్?"

తెరలుతెరలుగా వస్తున్న నవ్వు ఆపుకుంటూ అంది కౌసల్య. "ఇప్పటికే మన అపార్ట్‌మెంట్ మినీ నర్సరీ చేసేశానని నన్ను తిడుతుంటావు. అందుకని నవ్వొచ్చింది".

ఇంతలో నర్సరీ యజమాని సాదరంగా ఆహ్వానించాడు. కౌసల్య తనకు కావలసిన మొక్కల వివరాలు చెప్పింది. అతను వెంటనే పని పూరమాయించాడు. అది తనకేం పట్టనట్టుగా విశాలంగా ఉన్న ఆ నర్సరీ మొక్కల మధ్య సాధ్యమైనంత ఆనందాన్ని, మెదడులో నిక్షిప్తం చేసుకోవడానికి అన్నట్టుగా అనుపమ నడవసాగింది.

అనుపమ తిరిగి వచ్చేసరికి కౌసల్య గ్రాఫ్టింగ్ చేయించిన రెండు మొక్కలకూ డబ్బు ఇస్తోంది.

"మొక్కల్ని తీసుకుని స్కూటీ ఫుట్‌బోర్డులో పెట్టు" అంది కౌసల్య.

"పనివాడి చేత పెట్టిస్తానమ్మా! బరువుంటాయి" అన్నాడు నర్సరీ యజమాని.

"పర్వాలేదు మా అమ్మాయికి అలవాటేలెండి" అంది కౌసల్య.

ఇక తప్పదన్నట్టు వాటిని తల్లి చెప్పిన స్థానంలో అమర్చింది అనుపమ.

★★★

ఇంటికి చేరాక వాటికోసం అప్పటికే సిద్ధంచేసిన ప్లేసులో పెట్టింది కౌసల్య.

"ఇక నుంచీ దీనిని పెంచే పూచీ నీది. దీని బాధ్యత నీకు అప్పగిస్తున్నాను." అంది కౌసల్య.

అప్పుడే దాని మీద పూర్తి దృష్టి నిలిపి పరిశీలించిన అనుపమ పకపకా విరగబడి నవ్వసాగింది.

అది మామిడికి వేపకొమ్మను గ్రాఫ్టింగ్

చేసినది.

"ఇదేమిటమ్మా! నీకు మతిగాని పోయిందా? లేక వాడు మర్చిపోయి అలా గ్రాఫ్టింగ్ చేశాడా? మామిడికి వేపగ్రాఫ్టింగ్ చేయడమేమిటి వెర్రికాకపోతే?"

"నువ్వేమయినా అనుకో. నాపిచ్చినాది. అలా గ్రాఫ్టింగ్ చేసే ఏరకం కాయలు కాస్తాయెూ చూడాలని నేను ముచ్చటపడిపోతున్నాను తెలుసా?"

"అదేదో నువ్వే పెంచుకో బాబూ. నేను పడలేను" అంది అనుపమ చిరుకోపంగా.

"నీకు బాధ్యత అప్పగించింది తిరిగి నాకు అప్పగిస్తావని కాదు. దానిపట్ల నువ్వు ఎంత శ్రద్ధ చూపిస్తావోనని. దాని బాధ్యత పూర్తిగా వహిస్తానని నువ్వు మాటివ్వాలి."

"ప్లీజ్ మమ్మీ! నాకు ఇష్టం లేదు."

"అలా అనకు. కొన్నిటిని మనకిష్టం లేకపోయినా అనుసరించాల్సి వస్తుంది. ఫర్ ఎగ్జాంపుల్ నాకు వారం రోజులు డెప్యుటేషన్ వేశారు పారుగూరులోని మరో ఆఫీసుకి. యిష్టంలేదు అయినా తప్పదు. నామాట విని ఈ ఒక్క మొక్క పట్ల నీ అభిమానం పెంచుకో. నిన్ను మరేమీ కోరను. సరేనా?" అంది కౌసల్య చెయ్యి చాస్తూ.

అయిష్టంగానే తల్లి చేతిలో చెయ్యి వేసింది అనుపమ.

★★★

కౌసల్య ఆరోజు ఉదయం డెప్యుటేషన్‌పై బయల్దేరాల్సి రావడంతో ఉదయమే తయారై వెళ్ళిపోయింది. వెళ్తూ ఒక కవరు అనుపమకి ఇచ్చి అంది- "అనూ! పెద్దవాళ్ళు లేనప్పుడు చిన్నపిల్లలకు పిచ్చిపిచ్చి పనులు చేయాలనిపించడం సహజం. అలా అనిపించినపుడు ఆ పని చేయబోయే ముందు ఈ ఉత్తరం చదువు. మర్చిపోకు"

అనుపమ కవరును బెడ్ మీద పడేసింది నిర్లక్ష్యంగా.

గబాగబా నందకిషోర్‌కు ఫోన్ చేసింది. ఈ వేళ రాజమండ్రి రావడం లేదని కంప్యూటర్ వర్క్సుకు ఫోన్ చేశానని, తనతో వివరంగా మనసు విప్పి మాట్లాడాలని, తొందరగా రమ్మని! ఆపై ఆలోచనలో పడింది.

అమ్మతో తన మనసులో మాట చెప్పింది. అమ్మ మర్నాడు సమాధానం చెబుతానంది కానీ చెప్పనేలేదు. తనకు ఏది ఇష్టంలేకపోయినా 'నీకు ఇష్టమైతే నాకూ ఇష్టమే' అంటుంది. ఈ సారి అదీ చెప్పలేదు. 'ఛ' అమ్మ ఎప్పుడూ ఇంతే! చికాకుగా అనిపించడంతో బాత్‌రూంలో దూరి మనసారా స్నానం చేసింది. స్నానం చేస్తున్నంతసేపు ఎ... ల్లరి వూహాలు.

నందకిషోర్ తన చెవుల వెనుక నుంచి వెచ్చని ఊపిరిలూదుతూ చెవిలో గుసగుస లాడుతున్నట్టుగా, తనని ఆక్రమించుకున్నట్టుగా, తాను దొరికీదొరక్క ఊరిస్తున్నట్లుగా.

అతను తనను కోరరానిదేదయినా కోరితే... బయట తాను అతనితో ఎంత తిరిగినా కేవలం కరచాలనం వరకే పరిమితం చేసింది అతన్ని! ఒకవేళ అతను తనను బలవంతం చేస్తే... ఉహూ! నందు అలా చెయ్యడు. తనకా నమ్మకం ఉంది. తనే

ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా జాగ్రత్తపడాలి. ఈమధ్య మనసు విప్పి మాట్లాడడం కన్నా శారీరకంగా కలవడంలోనే ఎక్కువ ఇంట్రెస్టు చూపిస్తున్నాడు. ఏం మాట్లాడినా అక్కడికే డైవర్ట్ చేస్తున్నాడు. ఏ ఇద్దరి జంట కనపడినా వారిద్దరి మధ్య 'అది' జరిగిపోయే వుంటుందని వూహిస్తాడు. అతనలా మాట్లాడినపుడల్లా ఎంతో ఇబ్బందిగా ఉంటుంది. అందుకే అతన్ని దూరంగా ఉంచే అతని అభిప్రాయం తెలుసుకోవాలి. స్నానం పూర్తిచేసి డ్రెస్ చేసుకుంటున్నంత సేపూ అనువమ ఆలోచిస్తూనే వుంది. బుర్ర వేడెక్కిపోవడంతో ఫాన్ ఆన్‌చేసి మంచంమీద వాలిపోయింది.

నందు ఇంకారాలేదు.

ఆలోచిస్తూనే అప్రయత్నంగా ప్రక్కకు ఒత్తిగిల్లిన ఆమెకు తల్లి ఇచ్చిన కవరు చేతులకు తగిలింది. కవరు ఇచ్చివెళ్తూ తల్లి అన్న మాటలు గుర్తొచ్చాయి.

వెంటనే ఆమె దాన్ని విప్పింది. అందులో ఇలా ఉంది.

"అమ్మా అనూ!

ఆలోచించడం అనేది మానవుడికి భగవంతుడు ఇచ్చిన వరం. నువ్వు చక్కని ఆలోచనా పటిమ గల వ్యక్తివి అని నానమ్మకం. అందుకే నా వాదన విన్న మీదట నువ్వు ఎలా నిర్ణయించుకున్నా నీ దారికి నేను అడ్డు రాను.

నేను వయసులో ఉండగా ఒకతన్ని ప్రేమించాను. అతను నాకు దూరపు బంధువు అవుతాడు. అతన్ని నమ్మి నా తనువు అర్పించాను. ఫలితంగా గర్భవతినయ్యాను. అమ్మానాన్న అతనితో వెళ్ళిపొమ్మని నిష్కర్షగా చెప్పేశారు. సరే అని అతన్ని ఒప్పించి అతనితో బయల్దేరాను. అతను తన స్నేహితుడు రాజారామ్ ఇంట్లో నన్ను ఆ రాత్రి ఉంచి పరారైపోయాడు. నా నిస్సహాయతతెలిసిన రాజారామ్ అతని కోసం వెతికిస్తానని నన్ను అక్కడే వుండమని కోరాడు అంగీకరించాను. అతని భార్య అపుడు ఊళ్ళోలేదు. పురిటికి వెళ్ళింది.

అంతలో నాకు ప్రస్తుతం నేను చేస్తున్న జాబ్ తాలూకు అపాయింట్‌మెంట్ ఆర్డరు వచ్చింది. జాబ్‌లో జాయిన్ అయ్యాను. మొదటి శాలరీ తీసుకున్నాక రాజారామ్ ఇంటి నుంచి వచ్చేసాను. వర్కింగ్ ఉమన్స్ హాస్టల్‌లో చేరాను.

తరువాత నువ్వు పుట్టావు. నా కలలకు తగ్గట్టు నిన్ను పెంచుకున్నాను. నీకు కావలసినంత స్వేచ్ఛనిచ్చాను. ఎందుకంటే నువ్వు ఏ తప్పు చేసినా 'అమ్మా ఈ వేళ ఈ తప్పు చేశాను. నన్ను క్షమించు. ఇంకెప్పుడూ ఈ తప్పుచేయను' అని చెప్పేసేదానివి. అందుకే నాకు నువ్వంటే పరిపూర్ణమైన నమ్మకం.

కులాంతర మతాంతర వివాహాలకు నేను వ్యతిరేకిని కాదు. కానీ ప్రతీ మనిషి కొన్ని ఆహారపు అలవాట్లు, నియమాల మధ్య బ్రతుకుతాడు. అవతలివాళ్ళు తమ అలవాట్లు ఎలా మానుకోలేరో మనమూ అంత తేలిగ్గా ఆ అలవాట్లు నేర్చుకోలేము.

నాకు తెలిసిన ఇలాంటి వివాహవ్యవస్థలో ఆడది సర్దుకు పోవలసిందే కానీ మగవాడు సర్దుకుపోడు. వయసు వేడిలో ఆడది బలవంతంగా చేసుకున్న అలవాట్లు జీవితాంతం శాపంలా వెంటాడి వేధిస్తుంటాయి. భర్తకు వండిపెట్టడం తప్పనిసరై, తాను తినలేక అవస్థపడుతుంటుంది.

వారిద్దరివీ వేరు వేరు ఆహారపు అలవాట్లు అనుకుందాం. అంటే ఒకరు వెజ్. మరొకరు నాన్‌వెజ్. వారిపిల్లలకు శాస్త్రప్రకారం తండ్రి కులమే వర్తిస్తుంది. ప్రపంచం అతివేగంగా మారిపోతుంది. అనేక కాలుష్యాల మధ్య బ్రతుకుతున్న మనం లేని ఒక కొత్త సమస్యను సృష్టించుకునే కంటే అసలు దాని జోలికి పోవడమే మంచిది కాదంటాను.

నా అనుభవాలను నీకు అర్థం అయ్యేలా చెప్పాలనే మామిడికి వేప గ్రాఫ్టింగ్ చేయించాను.

మామిడి పులుపు ఒంటికి మంచిదని, వేప చేదు ఆరోగ్యానికి మంచిదని తెలిసినా మామిడిని వేపతో ఎందుకు సంకరపరచరు? దాని కాయలు ఎలా ఉంటాయో ఊహించు.

నా వాదన అర్థమైందనుకుంటాను. బిడ్డగా నీ సుఖం, నీ భవిష్యత్తు నాకు ముఖ్యం. మొన్న నందూ వాదన వినే వుంటావు. తన అలవాట్లు ప్రపంచం తలకిందులైనా మార్చుకోలేనని చెప్పాడు.

ఇంత చదివాక నేను నీకు చెప్పాల్సిన పని లేదు. ఆలోచించుకుని నీకు ఎలా అనిపిస్తే అలా చెయ్! నువ్వు తీసుకోబోయే నిర్ణయం నన్ను బాధించినా పర్వాలేదు. కానీ 'పొరపాటు చేశానే' అని భవిష్యత్తులో నువ్వు ఏనాడు బాధపడకూడదు. అది నా కోరిక. మర్చిపోకు.

ఆశీస్సులతో
సదా నీ సుఖంకోరే
అమ్మ"

ఉత్తరం రెండు సార్లు కాదు, ఇరవైసార్లు చదివింది అనుపమ. ఎందుకో కనులనిండా నీళ్ళు తిరిగి జలజలా రాలిపోయాయి. ఎంత సున్నితంగా చెప్పింది అమ్మ!... అనుకుంది.

అంతలో కాలింగ్‌బెల్ మోగింది. వచ్చింది నందకిశోర్ అని తెలుస్తోంది.

అనుపమ ఉత్తరం కవరులో పెట్టి తన బట్టల మధ్య జాగ్రత్తగా దాచింది.

మనసులో ఏ అలజడి లేకుండా ధీమాగా తలుపు వైపు అడుగులేసింది. ●

'ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక'
26-11-2002